సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 15 । జూలై । 2024



సాగరతీరంలో ఐఎన్ఎస్ విరాట్!

ఐఎన్ఎస్ విరాట్ యుద్ధనౌక విశాఖ సాగరతీరంలో దర్శనమివ్వనుంది. అయితే ఇది నిజమైన నౌక కాదు. దాని నమూనా. 8లో



వరుస దొంగతనాలు 8లో

వరుస దొంగతనాలతో పెదబయలు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇక్కడ మోదసాయి నగర్‌లో ఐదు ఇళ్లలో చోరీలు జరిగాయి.



ఎర్రమట్టి దిబ్బల్లో షూటింగ్ 8లో

భీమిలి బీచ్ రోడ్డులోని ఎర్రమట్టి దిబ్బల్లో షూటింగ్ సందడి నెలకొంది. హీరో వరుణ్‌తేజ్‌పై సన్నివేశాలు చిత్రీకరించారు.

న్యూస్‌రీల్

పోశమ్మ ఆలయం హుండీ ఆదాయం లెక్కింపు

దేవీపట్నం: పోశమ్మ గండి అమ్మవారి ఆదాయం ఆదివారం ఒక్కరోజు లెక్కించారు. ఒక్కరోజు ఆదాయం రూ. 19వేల 740 వచ్చినట్లు ఆలయ ఈవో జీవీ లక్ష్మీకుమార్ తెలిపారు.

పాపికొండలు విహార యాత్రకు బ్రేక్: వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో పాపికొండలు విహారయాత్రకు సోమవారం విరామం ప్రకటించినట్లు పర్యాటకశాఖ అధికారులు తెలిపారు.

మోదమ్మకు భక్తుల నీరాజనం



పాడేరు ఘాట్‌లోని మోదమ్మ పాదాల గుడికి ఘటాలను తీసుకెళ్తున్న భక్తులు

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం మోదకొండమ్మ తల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని మోదకొండమ్మ తల్లి ఆలయంతోపాటు, పాడేరు ఘాట్‌లోని అమ్మవారి పాదాలు గుడి వద్ద భక్తులు ఇంటి పండగలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మోదమ్మకు ఘటాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంలోని వాసవీ క్లబ్ ప్రతినిధి ఉప్పల రత్నం కుటుంబం జరుపుకున్న ఇంటి పండగలో మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ తమర్బ నరసింగరావు, ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, వర్తక సంఘం నేతలు, గిరిజన ఉద్యోగులు పాల్గొన్నారు. అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఘాట్‌లో మోదమ్మ పాదాలు గుడి వద్ద సమర్పించారు. మైదాన ప్రాంత భక్తులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు



ప్రిజమ్ కాలేజీలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

మహారాణిపేట: జిల్లాలో యూపీఎస్సీ ఆధ్వర్యంలో మెడికల్ సర్వీసెస్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, 2 నుంచి 4 గంటల వరకు రెండు సెషన్స్‌లో జరిగిన ఈ పరీక్షకు నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1,222 మందికి గాను 730 మంది హాజరయ్యారు. 492 మంది గైర్హాజరయ్యారు. రెండు సెషన్స్‌కు 59 శాతం మంది హాజరైనట్లు జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహనరావు తెలిపారు.

నేడు కేజీహెచ్‌కు రాష్ట్ర వైద్య ఆరోగ్య మంత్రి

మహారాణిపేట: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ సోమవారం కింగ్ జార్జ్ ఆస్పత్రిని సందర్శించనున్నారు. తొలిసారిగా మంత్రి కేజీహెచ్‌కు వస్తుండడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ఆయన మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు కేజీహెచ్‌లో పర్యటించి.. వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిసింది.

డీఎం దేవరాజు వేధింపులు

- జీసీసీ ఉద్యోగుల ఆవేదన



పాడేరు: తమను వేధింపులకు గురి చేస్తున్న చింతపల్లి జీసీసీ డీఎం దేవరాజుపై చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉద్యోగులు కోరారు. ఆదివారం పాడేరులో జీసీసీ ఉద్యోగులు ఎల్. రమణమూర్తి, ఎస్. శ్రీనివాసరావు, ప్రవీణ్ కుమార్, బి.రామారావు, టి.శంకర్‌రావు, జె. రాంబాబు, జె. నెహ్రూబాబు, కె.గంగరాజు, ఎం.వి. రమణమూర్తి విలేకరులతో మాట్లాడారు. డీఎం దేవరాజు ఎన్నో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని, ఏమైన నష్టాలు జరిగితే తమపై నెట్టేస్తున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే వేధింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. గిరిజన ఉద్యోగులను బదిలీలు చేస్తూ, గిరిజనేతర ఉద్యోగులకు నచ్చిన చోట పోస్టింగ్‌లు ఇస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో కలెక్టర్ జోక్యం చేసుకోవాలని, లేనిపక్షంలో తామంతా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

జిల్లా అంతటా కుండపోత వాన

జిల్లా అంతటా భారీ వర్షాలు కురుస్తున్నాయి. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాగులు, గెడ్డలు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నాయి. గోదావరి, శబరి నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. ఆదివారం కురిసిన కుండపోత వర్షంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. జిల్లా కేంద్రం పాడేరుతోపాటు మండల కేంద్రాలు జన సంచారం లేక బోసిపోయాయి. వారపు సంతలకు వర్షంతో ఆటంకం ఏర్పడింది.

- జన జీవనానికి అంతరాయం
- ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు, వాగులు
- గోదావరి, శబరి పరవళ్లు
- జిల్లాలో 673.4 మిల్లీమీటర్ల వర్షపాతం
- రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తం



వర్షంతో జనం లేని కొయ్యూరు సంత



హుకుంపేట-అరకు జాతీయ రహదారిలో కుండపోత వాన



వర్షంతో అరకు జాతీయ రహదారిపై ఇబ్బందులు పడుతున్న వాహన చోదకుడు



జి. మాడుగుల మండలంలో వర్షానికి పర్యటకులు రాక వెలవెలబోతున్న కొత్తపల్లి జలపాత ప్రాంతం

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం కురిసిన కుండపోత వర్షంతో జిల్లాలో 673.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొయ్యూరులో 86.8, దేవిపట్నంలో 59.6, మారేడుమిల్లిలో 58.2, గంగవరంలో 52.8, పెదబయలులో 51.4, అడ్డతీగలలో 50.2, జి.కె.వీధిలో 47.4, చింతూరులో 41.2, రాజవొమ్మంగిలో 36.4, వై.రామవరంలో 31.4, కూనవరంలో 28.2, వి.ఆర్.పురంలో 26.8, ముంచంగిపుట్టులో 18.4, పాడేరులో 15, అరకులోయలో 14.6, డుంబ్రిగుడలో 12.4, రంపచోడవరంలో 12.8, ఏటపాకలో 12.4, హుకుంపేటలో 10.6, అనంతగిరిలో 4.6, జి.మాడుగులలో 1.8, చింతపల్లిలో 0.4 మిల్లీమీటర్ల మేర వర్షం పడింది.

చెరువులను తలపిస్తున్న పంట భూములు

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురవడంతో వ్యవసాయ భూముల నిండా వరద నీరు చేరింది. లోతట్టు వ్యవసాయ భూములు వరద నీటితో తటాకాన్ని తలపించాయి. హుకుంపేట, అరకులోయ, డుంబ్రిగుడ, పెదబయలు, అనంతగిరి, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో అనేక ప్రాంతాల్లో వ్యవసాయ భూములన్నీ వరద ముంపునకు గురయ్యాయి. చింతూరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలోను ఇదే పరిస్థితి నెలకొంది.

ఉధృతంగా నదులు, గెడ్డలు

జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ప్రధాన నదులు, గెడ్డలు ఉధృతంగానే ప్రవహిస్తున్నాయి. చింతూరు డివిజన్ పరిధిలోని గోదావరి, శబరి నదులలో వరదనీటి ప్రవాహం పెరిగింది. అనంతగిరి మండలంలోని గోస్తానీ, శారద నదులతోపాటు జి.మాడుగుల నుంచి ముంచంగిపుట్టు మండలం వరకు విస్తరించిన మత్స్యగెడ్డ వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. రాళ్లగెడ్డ, చాపరాయిగెడ్డ, దిగుడుపుట్టు గెడ్డ, పెద్దగెడ్డలతోపాటు కొయ్యూరు, జి.కె.వీధి, రాజవొమ్మంగి, గంగవరం ప్రాంతాల్లోని ప్రధాన గెడ్డలు, కొండవాగులలో వరద నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో ఆయా గెడ్డల ప్రాంతాల్లోని గిరిజనులను రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తం చేసింది.

పర్యాటక ప్రాంతం వెలవెల..

జి.మాడుగుల మండలంలో భారీ వర్షాలకు పర్యాటకులు రాకపోవటంతో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కొత్తపల్లి జలపాతం వెలవెలబోయింది.

నెల్లిపూడి వాగులో గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు



నెల్లిపూడి వాగులో గాలిస్తున్న యువకులు, గజ ఈతగాళ్లు

గంగవరం: మండలంలోని నెల్లిపూడి వాగులో శనివారం గల్లంతైన వ్యక్తి గొరగుమ్మి గ్రామానికి చెందిన మోహన్‌రావుగా ప్రాథమిక విచారణలో తేలిందని ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఆదివారం వాగు వెంబడి గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఇక్కడ లభ్యమైన ద్విచక్ర వాహనం అతడిదేనని గ్రామస్తులు గుర్తించారని తెలిపారు. నెల్లిపూడి వంతెనకు ఇరువైపులా గంగవరం పోలీసులు, రెవెన్యూ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు. మోహన్‌రావు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.



హుకుంపేట మండలం టిటింగ్‌వలస ప్రాంతంలో పొలాల మీదుగా వరద నీటి ప్రవాహం

విహారయాత్రకు వచ్చి..

సోకులేరు వాగులో యువకుడు గల్లంతు



గల్లంతైన యువకుడు

మోతుగూడెం: చింతూరు మండలం సోకులేరు వ్యూ పాయింట్ వద్ద సోకులేరులో ఇద్దరు గల్లంతయ్యారు. వీరిలో ఒకరిని స్థానికులు కాపాడగా, విజయవాడ దరి గుణదలకు చెందిన అల్లూరు తేజ(24) జాడ లేదు. విజయవాడ నుంచి విహార యాత్రకు వచ్చిన వీరు సోకులేరు వాగులో స్నానాలు చేస్తుండగా ఈ ప్రమాదానికి గురయ్యారు. గల్లంతైన యువకుడి ఆచూకీ కోసం మోతుగూడెం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై బి. గోపాల్‌రావు తెలిపారు. సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మొదలైన చంద్రబాబు ఎన్నికల హామీల మోసం

- అరకులోయ ఎమ్మెల్యే మత్స్యలింగం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, చిత్రంలో పార్టీ నాయకులు

అరకులోయ టౌన్: ఎన్నికల సమయంలో బూటకపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు వాటిని అమలు చేయడం లేదని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ధ్వజమెత్తారు. ఆదివారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో అలవిమాలిన పథకాలపై హామీలు గుప్పించి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. తల్లికి వందనం పేరిట కుటుంబంలో ఒకటి నుంచి 12వ తరగతి వరకు ఎంత మంది విద్యార్థులుంటే అంత మందికి ఏటా రూ.15 వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఒక్కరికే అని చెప్పడం దారుణమన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు, మహిళలకు రూ.1,500, చదువుకున్న యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానన్న చంద్రబాబు వాటిని వెంటనే అమలు చేయాలన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టో హామీల కంటే ఎక్కువ సంక్షేమం, అభివృద్ధి చేశారన్నారు. 2020 జనవరి 19 నుంచి ఏటా అమ్మఒడి పథకం కింద విద్యార్థుల తల్లుల ఖాతాలో రూ.15 వేల చొప్పున జమ చేశారన్నారు. అంతేకాకుండా రైతు భరోసా, కాపు నేస్తం, వాహన మిత్ర, తదితర సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. జగన్‌మోహన్ రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుతో తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అటువంటి తప్పుడు ఆలోచనలు మానుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ శెట్టి రోషిణి, పద్మాపురం సర్పంచ్ పెట్టెలి సుస్మిత, మార్కెట్ యార్డ్ చైర్మన్ కిల్లో రాజరమేష్, పార్టీ మహిళ విభాగం మండల అధ్యక్షురాలు సుమిత్ర, మండల మాజీ అధ్యక్షుడు కొర్రా గాశి, సీనియర్ నాయకులు కమిడి అశోక్, స్వాభి రామూర్తి, గుంజిడి ప్రసాద్, శెట్టి మోహన్ పాల్గొన్నారు.

శబరి, గోదావరి నదులకు జలకళ



కూనవరం వద్ద శబరి, గోదావరి సంగమ తీరంలో ఉట్టిపడుతున్న జలకళ

కూనవరం: నిన్న మొన్నటి వరకు అక్కడక్కడా ఇసుక దిబ్బలు, ఎక్కడో సుదూరంలో పిల్ల కాలువలా దర్శనమిచ్చిన గోదావరి, శబరి నదులు కొత్త నీరు రాకతో జలకళ సంతరించుకున్నాయి. నాలుగైదు రోజుల నుంచి ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రం వద్ద సంగమ తీరంలో ఉభయ నదులు కలిసి నిండుగా ప్రవహిస్తున్నాయి. 2022 జూలై 14న మండలం యావత్తు వరద ముంపునకు గురైంది. ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ పునరావాస కేంద్రాలలో తలదాచుకున్నారు. అప్పుడు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 71.3 అడుగులు నమోదు కాగా, కూనవరం వద్ద 76.8 నమోదైంది. 2023 జూలై 29న అదే పరిస్థితి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 59.1 అడుగులు నమోదు కాగా, కూనవరం వద్ద 64 అడుగులకు చేరింది. అప్పటి భయానక పరిస్థితులను నెమరు వేసుకుంటూ జూలై, ఆగస్టు నెలలంటే హడలెత్తి పోతున్నారు. ఈ రెణ్నెళ్లు ఏదోలా గట్టెక్కితే చాలని భగవంతుడిని వేడుకుంటున్నారు. కాగా ఈ ఏడాది జూలై మూడో వారం ప్రవేశించినప్పటికి శబరి, గోదావరి నదుల నీటిమట్టం అత్యంత దిగువ స్థాయిలో ఉండటంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఆదివారం సాయంత్రం భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 13.4 అడుగులు కాగా, కూనవరం వద్ద 7.94 మీటర్లు (సుమారు ఏడున్నర అడుగులు) నమోదైంది.

వర్షంలోనూ పర్యాటకుల జోష్



చాపరాయి వద్ద వర్షంలోను పర్యాటకుల సందడి



చాపరాయి ప్రవేశ ద్వారం వద్ద పర్యాటకులు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో వర్షాలు కురుస్తున్నప్పటికీ పర్యాటకులు మాత్రం సందడి చేస్తున్నారు. ఆదివారం అరకులోయ ప్రాంతానికి పర్యాటకులు భారీగానే తరలివచ్చారు. ఇక్కడ పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. స్నానాలకు పేరొందిన డుంబ్రిగుడ మండలం చాపరాయి జలపాతానికి పర్యాటకుల తాకిడి నెలకొంది. జోరువానలోను ఇక్కడ జలపాతం వద్ద సందడి చేశారు. గెడ్డలో వరద నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో ఐటీడీఏ అధికారులు స్నానాలకు దిగకుండా వారిని నియంత్రించారు. అయితే వర్షంలో తడుస్తూనే ప్రకృతితో మమేకం అయ్యారు. పగోడాలో థింసా నృత్యాలు, డప్పు వాయిద్యాల హోరులో డ్యాన్స్ కట్టారు. బెంబో చికెన్, ఇతర వంటకాలకు ఆదరణ నెలకొంది.

మా పిల్లలకు పాఠాలు చెప్పించండి..



తంగేళ్లబంధ తాత్కాలిక పాఠశాల షెడ్డు వద్ద చేతులెత్తి విన్నవిస్తున్న విద్యార్థులు

- వేడుకుంటున్న తంగేళ్లబంధ గ్రామస్తులు

అనంతగిరి: మండలంలోని కివర్ల పంచాయతీ తంగేళ్లబంధ గ్రామంలో తాత్కాలిక షెడ్డు నిర్మించుకున్నాం.. ఒక ఉపాధ్యాయుడిని నియమించి, తమ పిల్లలకు చదువు చెప్పించడయ్యా అంటూ గ్రామస్తులు వేడుకుంటున్నారు. వర్షాకాలం కావడంతో గ్రామ సమీపంలోని గెడ్డ పొంగి ప్రవహిస్తోంది. దీంతో గ్రామం నుంచి గంగవరం పాఠశాలకు విద్యార్థులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా షెడ్డు నిర్మించుకున్నాం, ఉపాధ్యాయుడిని నియమించాలని గత నెలలో అధికారులను కోరారు. అయితే షెడ్డు నిర్మించి వారం గడుస్తుందని, చర్యలు తీసుకోవాలని ఆదివారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చేతులు జోడించి వినూత్నంగా వేడుకున్నారు.

జీపీఎస్ గెజిట్ ప్రతుల దహనం



జీవో ఎంఎస్ 54న ప్రతులను దహనం చేస్తున్న ఉపాధ్యాయులు



గంగవరం సెంటర్‌లో జీవో ప్రతులు దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉద్యోగులు

గంగవరం: కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయడాన్ని యూటీఎఫ్ తీవ్రంగా ఖండించింది. జీవో నంబరు 54ను వ్యతిరేకిస్తూ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం గంగవరం వై. జంక్షన్ కూడలిలో గెజిట్ నోటిఫికేషన్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కోశాధికారి కె.కృష్ణ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.రాంబాబు, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2023 అక్టోబర్ 20 నుంచి సీపీఎస్ ఉద్యోగులందరినీ జీపీఎస్‌లోకి తెస్తూ విడుదల చేసిన రాజపత్రాన్ని రద్దు చేయాలని, తక్షణమే పాత పెన్షన్ పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ మహిళా అధ్యక్షురాలు రుక్మిణి, సహాధ్యక్షుడు కారం బొజ్జిదొర, జిల్లా కౌన్సిలర్ మడకం వెంకన్నదొర, నాయకులు మామిడి బాలరాజు, కోసు శ్రీనువాసుదొర, పరదా స్వామిదొర, రామకృష్ణారెడ్డి , సచివాలయ, ఉద్యోగులు, ఆరోగ్యశాఖ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

రంపచోడవరంలో..

రంపచోడవరం: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయం ఎదుట దహనం చేశారు. యూటీఎఫ్ రంపచోడవరం డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ సనాతనబాబు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంగళరావు, కారం సూరిబాబు, వెంకటలక్ష్మి, కె. వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ గెజిట్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్



శేషగిరిరావు



గిడ్డి వరలక్ష్మి

పెదబయలు: రాష్ట్ర ప్రభుత్వం జీపీఎస్‌ను అమలు చేస్తూ వెలువరించిన గెజిట్‌ను రద్దు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సీకరి శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి గిడ్డి వరలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చి, దాని కంటే మెరుగైన గ్యారంటీ పెన్షన్స్ స్కీమ్ విధి విధానాలకు రూపొందించిందన్నారు. ఆ తర్వాత జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తూ పూర్వ ఆర్థిక కార్యదర్శి రావత్ సంతకం చేసి ఉన్న జీపీఎస్ గెజిట్‌ను ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేయడంపై ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. దీంతోపాటు 12వ పీఆర్సీ అమలు, పెండింగ్ బకాయిలపైన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్న తరుణంలో ఆకస్మాత్తుగా గెజిట్ వెలువడడం దారుణమన్నారు. దీన్ని వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నూకాంబిక ఆలయానికి భక్తుల తాకిడి



అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారికి దర్శనానికి ఆదివారం భక్తుల పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పిల్లపాపలతో వచ్చి బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణ పరిధిలో కొంతమంది భక్తులు తమ గృహాల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు చేశారు.

వర్షాలకు కుప్పకూలిన తాటాకిల్లు



అడ్డతీగల మండలం వేటమామిడిలో వర్షాలకు కూలిన తాటాకిల్లు

అడ్డతీగల: ఎడతెరిపిలేని వర్షాలకు మండలంలోని వేటమామిడిలో గిరిజనుడు వేంపాటి రమేష్‌కు చెందిన తాటాకిల్లు ఆదివారం ఒక్కసారిగా కుప్పకూలింది. దాంతో భయభ్రాంతులైన రమేష్, అతని భార్య, ఇద్దరు పిల్లలు హుటాహుటిన కూలిన ఇంట్లో నుంచి బతుకుజీవుడా అని బయటపడ్డారు. బాధితులను బీజేపీ జిల్లా కార్యదర్శి ఈరోజు స్వప్న కుమారి, టీడీపీ కార్యకర్తలు పరామర్శించారు. రెవెన్యూ అధికారులు కూలిన ఇంటిని పరిశీలించి నష్టం అంచనా వేస్తున్నారు. నిరాశ్రయుల య్యామని ప్రభుత్వం తమను ఆదుకుని పక్కా ఇంటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని బాధితుడు రమేష్ కోరాడు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఉపాధ్యాయుల సమస్యలపై వినతిపత్రాన్ని కార్యవర్గ సభ్యులకు అందజేస్తున్న అల్లూరి జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు గిరి

చింతపల్లిరూరల్: ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని అల్లూరి జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు యు.వి.గిరి అన్నారు. విజయవాడలో ఆదివారం జరిగిన పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఏజెన్సీలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను కార్యవర్గం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెం.117 న రద్దు చేయాలని, విశాఖ ఏజెన్సీకి బదిలీ అయిన మైదాన ప్రాంత ఉపాధ్యాయులను ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించి, వారిని తిరిగి మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని వినతిలో కోరారు. ఉపాధ్యాయుల ఆన్‌లైన్ పని ఒత్తిడి తగ్గించి, విద్యార్థులకు పాఠాల బోధనపై ఎక్కువ సమయాన్ని కేటాయించేలా కృషి చేయాలన్నారు. ఎస్ఎస్ఏ, కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలను నెల వారీగా చెల్లించాలని కోరారు.

సాగరతీరంలో ఐఎన్‌ఎస్ విరాట్!




సిద్ధమవుతున్న ఐఎన్‌ఎస్ విరాట్ నమూనా

బీచ్‌రోడ్డు: భారత నౌకాదళ చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిన ఐఎన్‌ఎస్ విరాట్ యుద్ధనౌక విశాఖ సాగరతీరంలో దర్శనమివ్వనుంది. అయితే ఇది నిజమైన నౌక కాదు. దాని నమూనా. ఐఎన్‌ఎస్ విరాట్‌ను సాగరతీరంలో మ్యూజియంగా తీర్చిదిద్దాలని భావించినప్పటికీ.. కొన్ని కారణాల వల్ల సాధ్యపడలేదు. ఆ లోటును పూడ్చేందుకు విరాట్ నమూనాను విక్టరీ ఎట్ సీ వద్ద సిద్ధం చేస్తున్నారు. దీనిని సందర్శకులు దూరం నుంచి స్పష్టంగా చూసేందుకు.. చుట్టూ పెద్ద అద్దాలను అమర్చారు. ఈ అద్భుతమైన నమూనాను తయారు చేయడానికి కళాకారులు శ్రమిస్తున్నారు. ఐఎన్‌ఎస్ విరాట్ భారత నౌకాదళానికి ఎంతో కాలం సేవ చేసింది. విరాట్ వైభవవంతమైన చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు నేవీ వర్గాలు తెలిపాయి.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

నర్సీపట్నం: మున్సిపాలిటీలో 23వ వార్డుకు చెందిన ఎస్.ఎర్రినాయుడు అనే వ్యక్తి అకారణంగా తనపై దాడి చేసి గాయపరిచాడని అదే వార్డుకు చెందిన గుడపు కొండ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వర రావు తెలిపారు. టీటీడీ కల్యాణ మండపం దగ్గరలో గల తన లారీ సప్లయి ఆఫీసుకు ఎర్రినాయుడు తరచూ వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నాండంటూ బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్ఐ తెలిపారు. ఎర్రినాయుడు మద్యం మత్తులో తనపై దాడి చేసి గాయపరచడమే కాకుండా చంపేస్తానని బెదిరించాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పెదబయలులో వరుస దొంగతనాలు



పెదబయలులో వంతాల నర్సింగమూర్తి ఇంట్లో బీరువా పగులగొట్టిన దృశ్యం

- మోదసాయి నగర్‌లోని ఐదు ఇళ్లలో చోరీలు
- 10 తులాల బంగారం, 120 తులాల వెండి అపహరణ
- కేసుల్లో పురోగతి సాధించని పోలీసులు

పెదబయలు: వరుస దొంగతనాలతో పెదబయలు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇక్కడ పోలీసు స్టేషన్‌కు ఆనుకుని వెనుక భాగంలో మోదసాయి నగర్‌లో నెల రోజుల వ్యవధిలో ఐదు చోరీలు జరిగాయి. హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్ వంతాల నరసింహమూర్తి ఇంటి వెనుక కిటికీ గ్రిల్స్ తొలగించి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి బీరువాలో 6 తులాల బంగారం, 90 తులాల వెండి, రూ.10 వేలు దొంగలించారు. ఈ ఘటన ఈ నెల 8న జరిగింది. ఆ మరుసటి రోజు అతడు ఇంటికి వచ్చి పరిశీలించి చోరీపై పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. గత నెల 10వ తేదీన ఉపాధ్యాయుడు నిక్కుల గంగాధర్ ఇంట్లో నాలుగు తులాల బంగారం, 30 తులాల వెండి దొంగలించారు. ఇదే వీధిలో ఉపాధ్యాయుడు బుడేయి దాసు పడాల్ ఇంట్లో మూడు వెండి గ్లాసులు, రూ.2 వేలు, జంపరంగి పార్వతి ఇంట్లో నివాసం ఉంటున్న కాంట్రాక్టర్ గదిలో రూ.40 వేలు చోరీ చేశారు. శనివారం రాత్రి ఉపాధ్యాయుడు చిట్టపులి సురేష్ ఇంట్లో కిటికీ ద్వారా లోపలికి ప్రవేశించడానికి విఫల యత్నం చేశారు.

సెలవు రోజుల్లోనే చోరీలు...

నెల రోజుల నుంచి వరుసగా దొంగతనాలు అది కూడా శని ఆదివారాలు సెలవు రోజుల్లో మాత్రమే జరుగుతున్నాయి. మోదసాయి నగర్‌లో ఎక్కువ మంది ఉద్యోగులు ఉండడం, సెలవు రోజుల్లో సొంత గ్రామాల్లో, వేరు పనులపై బయటకు వెళ్తే చోరీ జరుగుతుందని కాలనీ వాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఇలాంటి దొంగతనాలు లేవని, నెల రోజుల నుంచి చోటు చేసుకుంటున్నాయని వాపోతున్నారు. తమ వీధికి ఆనుకుని పోలీసు స్టేషన్ ఉన్నా వరుస చోరీలు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి సంపాదించుకున్న బంగారం, వెండి, నగదు చోరీ చేస్తున్నా పోలీసులు నిందితులను పట్టుకోవడంలో వైఫల్యం చెందుతున్నారని ఆగ్రహిస్తున్నారు. ఇళ్లలో ఒంటరిగా ఉండడం భయంగా ఉందని చెబుతున్నారు. నెల రోజుల వ్యవధిలో మోదసాయి నగర్‌లో 10 తులాల బంగారం, 120 తులాల వెండి చోరీ జరిగింది.



ఇంటి కిటికీ అద్దాలు పగులగొట్టిన దృశ్యం

ఇక నుంచి పోలీసు నిఘా..

గత నెలలో జరిగిన చోరీకి సంబంధించి పోలీసులు కొంతమంది అనుమానితులను పిలిచి విచారణ చేశారు. ఎలాంటి పురోగతి సాధించలేకపోయారు. పెదబయలు ఎస్ఐ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో చోరీ జరిగిన చిట్టపులి సురేష్, వంతాల నర్సింహమూర్తి ఇళ్లలో ఆదివారం క్లూస్ టీం పరిశీలించింది. వరుస చోరీలకు పాల్పడుతున్నవారిని పట్టుకుంటామని, అనుమానిత వ్యక్తులు వస్తే సమాచారం అందించాలని కోరారు. ఈ విషయంపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఇక నుంచి పోలీసు నిఘా పెంచుతామని ఎస్ఐ తెలిపారు.

చేతబడి అనుమానంతో వృద్ధుడి హత్య



సంఘటన స్థలంలో మృతదేహం

- పొలం గట్టు వివాదం కారణంగా చంపేశాడంటున్న మృతుని బంధువులు
- పోలీసు స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు
- కేజే పురంలో సంచలనం రేపిన ఘటన



సూర్యనారాయణ (ఫైల్)

మాడుగుల రూరల్: తన కుటుంబ సభ్యులకు చేతబడి చేశాడన్న అనుమానంతో ఒక వృద్ధుడిని కిరాతకంగా కత్తితో నరికి హత్య చేసిన సంఘటన సంచలనం రేపింది. అయితే పొలంగట్టు విషయంలో జరిగిన గొడవ కారణంగానే హత్య జరిగిందని మృతుడి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కేజే పురం గ్రామానికి చెందిన సూరిశెట్టి సూర్యనారాయణ(68), అదే గ్రామానికి చెందిన సూరిశెట్టి నర్సింగరావు బంధువులు. వీరి కల్లంపాకలు కె.జె.పురం పరిధిలోని తాచేరు నది సమీపంలో పక్కపక్కనే ఉన్నాయి. పొలం గట్టు సరిహద్దు గురించి శనివారం ఇద్దరి మధ్య వివాదం జరిగింది. ఆదివారం సాయంత్రం కూడా వీరి మధ్య మళ్లీ గొడవ రేగింది. ఈ సమయంలో పాకలో ఉన్న కత్తితో సూర్యనారాయణ మెడ మీద సూరిశెట్టి నర్సింగరావు దారుణంగా నరికాడు. దీంతో సూర్యనారాయణ అక్కడిక్కడే రక్తపు మడుగులో పడి మృతి చెందాడు. నేరం అంగీకరిస్తూ ఆదివారం రాత్రి మాడుగుల పోలీసు స్టేషన్‌కు వెళ్లి నిందితుడు లొంగిపోయాడు. తన కుటుంబ సభ్యులకు చేతబడి చేశాడని, అందువల్లే సూర్యనారాయణను హత్యచేశానని నిందితుడు నర్సింగరావు చెప్పినట్టు పోలీసులు తెలిపారు. సూర్యనారాయణ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ పి.దామోదర్‌నాయుడు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు సూర్యనారాయణకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ప్రణాళికలు పక్కాగా అమలుచేశాం..

- ఏపీఎల్ విజేతగా నిలిచాం..
- వారియర్స్ ఆటగాడు అశ్విన్ హెబ్బర్

విశాఖ స్పోర్ట్స్ : ఏపీఎల్ 3వ సీజన్‌లో పక్కాగా ప్రణాళికలు అమలుచేస్తూ.. కచ్చితంగా 500 పరుగులు సాధించాలన్నా కోచ్ నిర్దేశం అతడిలో కసిని పెంచింది. ఎనిమిది మ్యాచ్‌ల్లో 91.20తో యావరేజ్‌తో ఏకంగా సీజన్‌లోనే అత్యధిక పరుగులు(456) నమోదు చేశాడు. అతడే పదేళ్లగా రంజీల్లో ప్రతిభ కనబరుస్తూ చాంపియన్స్ ఎలెవెన్‌కు ఆడి... ప్రస్తుత ఏపీఎల్ సీజన్‌లో సత్తా చాటిన వైజాగ్ వారియర్స్ ఆటగాడు, వైస్ కెప్టెన్ అశ్విన్ హెబ్బర్. విశాఖ వేదికగా ముగిసిన ఏపీఎల్ మూడో సీజన్‌లో మొత్తంగా ఎనిమిది మ్యాచ్‌లాడిన అశ్విన్ నాలుగుసార్లు సెంచరీ మార్కుకు చేరువయ్యాడు. ఏపీఎల్ తొలి రెండు సీజన్లలో వారియర్స్ పెద్దగా రాణించకపోయినా ఈ సీజన్‌లో ఏకంగా టైటిల్‌నే ఎగరేసుకుపోవడంలో కీలకపాత్ర పోషించాడు. విజయానందాన్ని ‘సాక్షి’తో పంచుకున్నాడు. అతని మాటల్లోనే..

ఈ సీజన్ సంతృప్తినిచ్చింది.. ఏపీఎల్ గత రెండు సీజన్లకు భిన్నమైన స్ట్రాటజీతో ముందుకు వచ్చాం. కోచ్ ఇచ్చిన ప్రతి సలహాను అమలుపరిచాను. డైట్‌ను సైతం మార్చాను. ఆటగాళ్లతో వైస్ కెప్టెన్‌గా నాలుగు అంశాల్లో స్థిరమైన అంచనాతో చర్చించాను. అదే మాకు పెద్దగా హెల్ప్ అయింది. మొత్తం ఎనిమిది మ్యాచ్‌ల్లో 456 పరుగులు చేయడం సంతృప్తినిచ్చింది. గత రెండు సీజన్లలోనూ రాణించాను.

లీగ్ దశలో ఓడిన జట్టుతోనే టైటిల్ పోరు

లీగ్ దశలో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో డిఫెండింగ్ చాంపియన్ రాయలసీమ కింగ్స్‌ను ఓడించాం. అయితే ఉత్తరాంధ్ర లయన్స్ చేతిలో ఓటమి పాలయ్యాం. లీగ్‌లో మేము ఓడిన మ్యాచ్ అది ఒక్కటే. అక్కడే మా విజయానికే కాకుండా టైటిల్ గెలవడానికి ప్రణాళిక రచించాం. తు.చ తప్పకుండా అమలు చేశాం. ఫైనల్‌లో లయన్స్‌ను ఓడించి చాంపియన్‌గా నిలిచాం. వీడియోలను పరిశీలించాం.. లీగ్ దశలో కేవలం లయన్స్‌తో మ్యాచ్‌లో మాత్రమే ఓటమి చెందాం. ఫైనల్‌కు ముందు ప్రత్యర్థి బలం ఎక్కడ, జట్టు బలహీనతలు ఏమిటి అనేది చర్చించాం. ఎలాంటి షాట్స్ ఏ ఆటగాడు ఆడుతున్నాడు... వారి వీడియోలను నిశితంగా పరిశీలించాం. లెఫ్ట్, రైట్ కాంబినేషన్లతో ఒక ఫార్ములా తయారుచేసుకుని గ్రౌండ్‌లోనే గాక గ్రౌండ్ బయట ప్రాక్టీస్ చేశాం. అది ఎలాంటి ఫలితాన్ని ఇచ్చిందంటే ఏకంగా టైటిల్ సొంతం చేసుకునేంత. చర్చించిన విషయాల్ని అమలు పరిచాం. టైటిల్ వేటలో ప్రత్యర్థిని 102 పరుగులకే నిలువరించాం.

ఎర్రమట్టి దిబ్బల్లో షూటింగ్ సందడి

కొమ్మాది(విశాఖ) : భీమిలి బీచ్ రోడ్డులోని ప్రముఖ పర్యాటక ప్రాంతం ఎర్రమట్టి దిబ్బల్లో షూటింగ్ సందడి నెలకొంది. మెగా హీరో వరుణ్ తేజ్ నటిస్తున్న చిత్రానికి సంబంధించిన కొన్ని సన్నివేశాలు, ఫైటింగ్‌లను ఇక్కడ చిత్రీకరించారు. 15 రోజులపాటు విశాఖ - భీమిలి బీచ్ రోడ్డు ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ చిత్రీకరణ ఉంటుందని యూనిట్ సభ్యులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైల్వేస్టేషన్‌లో మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అతని వయస్సు సుమారు 50 ఏళ్లు ఉండవచ్చని, ఎత్తు సుమారు 5.5 అడుగులు, చామనచాయ రంగులో ఉన్నట్లు జీఆర్పీ ఎస్ఐ బాలాజీరావు తెలిపారు. అతడు నీలం రంగు పొడుగు చేతుల చొక్కా, నీలం రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గల గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా గానీ లేదా 96661 22722, 94406 27547 నెంబర్లలో గానీ తెలియజేయాలని కోరారు.

కూటమి ప్రభుత్వం హామీలు అమలుచేయాలి

పాడేరు : కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీను అమలు చేయాల్సిందేనని, లేని పక్షంలో ప్రజలతో కలిసి వైఎస్సార్‌సీపీ తమ పోరాటాలు కొనసాగిస్తుందని వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగ జిల్లా అధ్యక్షుడు గంపరాయి దిలీప్ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో అమలు కానీ ఆచరణ సాధ్యం కానీ హామీలను ఇచ్చి కూటమి పార్టీలు గద్దెనెక్కిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి నెలరోజులైనా ప్రజలకు శాశ్వత మేలు చేసే ఏ ఒక్క మంచి కార్యక్రమం చేపట్టలేదన్నారు. ఓట్లు వేయలేదనే కక్షతో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై, వారి ఆస్తులపై దాడులను పూనుకొని హత్యా రాజకీయాలను తెరతీశారన్నారు.

అరకు బహిరంగ సభకు హాజరైన చంద్రబాబునాయుడు వేలాది మంది గిరిజనుల సాక్షిగా జీవో నెం.3ను పునరుద్ధరిస్తామని, గిరిజన అభ్యర్థుల కోసం స్పెషల్ డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చి, నేడు గిరిజన నిరుద్యోగ యువత కోసం ఏ ప్రకటన చేయకపోవడం విచారకరమన్నారు. జీవో నెం.3 పై స్పష్టత ఇచ్చిన తర్వాతే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికి తల్లికి వందనం పథకం అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు ఒక్కరికే అమలు చేస్తామని ప్రకటనలు ఇవ్వడం కూటమీ పార్టీల మోసం బయటపడిందన్నారు. గిరిజన ప్రాంతలో ఉపాధి అవకాశాలు లేక చాలా మంది గిరిజనుల నిరుద్యోగ సమస్యతో కొట్టుమిట్టాడుతున్నారని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక్కరికి నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి అమలు చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నిత్యం ప్రజల పక్షానే ఉంటూ వారి సమస్యలపై పోరాటాలు నిలుస్తోందన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అప్పన్నస్వామికి ఆదివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

కాలేజీల లెక్క తేలాల్సిందే!

- జూనియర్ కాలేజీలపై ఫోకస్
- 'యు-డైస్ ప్లస్'లో నమోదైతేనే గుర్తింపు
- విద్యార్థుల సమగ్ర వివరాల సేకరణ
- కాలేజీల్లో కుస్తీలు పడుతున్న యాజమాన్యాలు
- ఈ కారణంగానే ఫస్టియర్ అడ్మిషన్లలో తీవ్ర జాప్యం



ఎన్ఏడీ వద్ద గల ఎస్ఆర్ జూనియర్ కాలేజీ

విశాఖ విద్య: జాతీయ విద్యా విధానం పటిష్టంగా అమలు చేయాలనే కేంద్ర ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా జూనియర్ కాలేజీల నిర్వహణపై ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలోనే విద్యార్థుల సమగ్ర వివరాలను తొలిసారిగా 'యు-డైస్ ప్లస్'పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. యు-డైస్ ప్లస్‌లో నమోదైన వివరాలనే ప్రామాణికంగా తీసుకుని భవిష్యత్‌లో కాలేజీలకు గుర్తింపు(రెన్యువల్ రికగ్నైజేషన్) ఇవ్వనున్నారు. ప్రస్తుతం ఇందులో నమోదైన విద్యార్థులనే ఈ ఏడాది వార్షిక పరీక్షలకు అనుమతించనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు. దీంతో విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని ఇంటర్ విద్యాశాఖాధికారులు అప్రమత్తమయ్యారు. కళాశాలల నిర్వాహకులతో ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 382 జూనియర్ కాలేజీలు ఇంటర్మీడియట్ బోర్డు వద్ద నమోదయ్యాయి. వీటిలో 21 కాలేజీలు నిర్వహణలో లేవు. మిగిలిన 361లో 13 కళాశాలల్లో మొదటి సంవత్సరం అడ్మిషన్లు జరుగలేదు. ఆరు కాలేజీల్లో మొదటి, రెండో సంవత్సరం అడ్మిషన్లు కూడా లేవు. 2023-24 విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో 58,944 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఇందులో ఒక్క విశాఖ జిల్లాలోని కాలేజీల్లోనే 40,871 మంది చేరారు.

కాలేజీలకు కేటాయించిన యు-డైస్ కోడ్‌తో ప్రస్తుతం విద్యార్థులు, కాలేజీలకు సంబంధించిన సమగ్ర వివరాలు నమోదు చేస్తున్నందున.. ఉమ్మడి విశాఖ జిల్లాలోని జూనియర్ కాలేజీల వాస్తవికత లెక్క తేలనుంది.

ఫస్టియర్ అడ్మిషన్లలో తీవ్ర జాప్యం

2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమై ఇప్పటికే 42 రోజులు గడిచిపోయింది. కానీ ఇంటర్మీడియట్ ఫస్టియర్ అడ్మిషన్లు సవ్యంగా ముందుకు సాగడం లేదు. యు-డైస్ ప్లస్ పోర్టల్‌లో సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థుల వివరాలన్నీ నమోదు చేస్తేనే, ఫస్టియర్ అడ్మిషన్లు నమోదుకు వెబ్‌సైట్‌లో అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియ కొన్ని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల వారికి చిక్కులు తెచ్చిపెట్టింది. ఒకే గుర్తింపుతో వేర్వేరు చోట్ల కాలేజీలు నిర్వహిస్తున్న వారికి ఈ పరిణామాలతో చెక్ పడింది. పరిమితికి మించి విద్యార్థులను చేర్చుకుని.. పరీక్షల సమయంలో ఏదో ఒక చోట నామినల్ రోల్ సృష్టించడం కూడా ఇక సాధ్యం కాదు. దీంతో కాలేజీల్లోని వాస్తవికతను యు-డైస్ ప్లస్‌లో నమోదు చేయక తప్పడం లేదు.

ప్రైవేటు కాలేజీల్లో తనిఖీలు నిల్

విద్యా సంవత్సరం ప్రారంభ సమయంలో ఏటా జూనియర్ కాలేజీలను ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు తనిఖీలు చేస్తుంటారు. ఇంటర్మీడియట్ కోర్సు ప్రాధాన్యం దృష్ట్యా జూనియర్ కాలేజీల్లో నిబంధనలు మేరకు అన్నీ సవ్యంగా ఉన్నాయా.? లేదా.? అనేది పరిశీలన చేస్తారు. కాలేజీ నిర్వహణకు అనువైన భవవనాలు, ఫైర్ సేఫ్టీ, ఆట స్థలం, సైన్స్ ల్యాబ్, అర్హత కలిగిన అధ్యాపకులు ఎంత మంది ఉన్నారనే వాస్తవికతను ధ్రువీకరిస్తారు. కానీ ఈ ఏడాది ఇవేమీ లేకుండానే కాలేజీల నిర్వహణకు కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వ పెద్దలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే ప్రచారం ఉంది. దీంతో మళ్లీ ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలకు రెక్కలొచ్చినట్లేనని విద్యారంగ నిపుణులు అంటున్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



కాలేజీలకు సంబంధించిన సమగ్ర వివరాలను యు-డైస్ ప్లస్‌లో వెంటనే నమోదు చేయాలి. దీనిపై కాలేజీల ప్రిన్సిపాళ్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్రైవేట్ కాలేజీలపై నిరంతరం తనిఖీలు ఉంటాయి. ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలు పాటించని కాలేజీలపై చర్యలు తీసుకుంటాం.

– మురళీధర్, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

చిట్టీల పేరుతో రూ.3కోట్ల కుచ్చుటోపీ



బాధితులతో మాట్లాడుతున్న ఆరిలోవ ఎస్ఐ నరసింహమూర్తి



చిట్టీల నిర్వాహకురాలు వెంకటలక్ష్మి ఇంటిని ముట్టడించిన బాధితులు

ఆరిలోవ: చిట్టీల పేరుతో ఓ మహిళ తోటి మహిళలకు టోకరా వేసింది. సుమారు రూ.3 కోట్లకు కుచ్చుటోపీ పెట్టేసింది. దీంతో బాధితులు ఆమె ఇంటిని ముట్టడించారు. డబ్బులు ఇవ్వాలని అడిగిన బాధితులకు నేను నివాసం ఉంటున్న ఇల్లు మాత్రమే ఉంది. అది అమ్ముకుని పంచుకోండి అంటూ ఆమె తెగేసి చెబుతోంది. బాధితులు తెలిపిన వివరాలివీ. జీవీఎంసీ 13వ వార్డు పరిధి లక్ష్మీనగర్‌లో అయితి వెంకటలక్ష్మి కొన్నేళ్లుగా చిట్టీలు నిర్వహిస్తోంది. ఆమె వద్ద సుమారు 120 మంది వరకు స్థానిక మహిళలు రూ.ఒక లక్ష, రూ.2 లక్షలు, రూ.3 లక్షలు, రూ.5 లక్షలు చిట్టీలు కడుతున్నారు. ఇలా మొత్తం రూ.3 కోట్ల వరకు కట్టారు. అవసరాల కోసం చిట్టీలు పాడుకునేవారు. కొన్నాళ్లుగా ఆమె చిట్టీలు పాడిన వారికి డబ్బులు ఇవ్వకుండా రేపు, ఎల్లుండి అంటూ తిప్పుతోంది. చివరికి తన వద్ద డబ్బులు లేవని తేల్చి చెప్పేసింది. దీంతో లబోదిబోమంటూ బాధితులు ఆమెను నిలదీశారు. మూడు నెలల కిందట బాధితులంతా ఆరిలోవ పోలీసులను కలిసి విషయం తెలియజేశారు. పోలీసుల సమక్షంలో రెండు నెలల్లో బాధితులకు డబ్బులు ఇచ్చేస్తానని వెంకటలక్ష్మి చెప్పింది. కానీ గడువు దాటినా డబ్బులు ఇవ్వలేదు. మళ్లీ అడిగితే తన ఇంటిని విక్రయించి డబ్బులు తీసుకోవాలని చెప్పింది. 60 చదరపు గజాల్లో మూడు అంతస్తులు ఉన్న ఆ ఇల్లు అక్కడ ధరలను బట్టి సుమారు రూ.60 లక్షల విలువ చేస్తుంది. దీంతో ఆ డబ్బులు కొందరి అప్పు మాత్రమే తీర్చడానికి సరిపోతాయి. దీంతో పాటు ఆ ఇంటి మీద రూ.25 లక్షలు బ్యాంక్ లోన్ కూడా ఉన్నట్లు బాధితులు అంటున్నారు. వెంకటలక్ష్మి కొద్ది రోజుల కిందట తన కుమారులను ఇంటి నుంచి వేరే ఊరు పంపించేసి ఒంటరిగా ఉంటోంది. దీంతో ఆదివారం బాధితులంతా వెంకటలక్ష్మి ఇంటిని ముట్టడించారు. డబ్బులు ఇవ్వాలని ఆమెను ఒత్తిడిచేశారు. నా వద్ద డబ్బులు లేవు. మీరే ఇంటిని అమ్ముకుని డబ్బులు తీసుకోండి అంటూ పాత పాటే పాడింది. సుమారు రూ.60లక్షలు విలువ చేసే ఆ ఇంటిని రూ.90 లక్షలకు విక్రయించాలని కూడా మరో మెలిక పెడుతోందని బాధితులు వాపోయారు. తమ డబ్బులతో వేరే చోట్ల ఇల్లు, స్థలాలు కొనుగోలు చేసిందని బాధితులు అంటున్నారు. వెంకటలక్ష్మి ఇంటిని బాధితులు ముట్టడించిన విషయం తెలుసుకున్న ఆరిలోవ ఎస్ఐ నరసింహమూర్తి, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి తగిన న్యాయం జరుగుతుందని వారికి నచ్చజెప్పారు. దీంతో బాధితులు స్టేషన్‌కు చేరుకుని వెంకటలక్ష్మిపై ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.